క్లుప్తంగా

ఆరోగ్య సమస్యలపై అవగాహన


మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రవీణ

వెదురుకుప్పం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఆరోగ్య సమస్యలపై గురువారం అవగాహన కల్పించారు. వైద్యాధికారి ప్రవీణ మాట్లాడుతూ పోషకాహార లోపం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని సూచించారు. ఒత్తిడికి గురికాకుండా మంచి ఆహారం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి, వైద్యాధికారి సురేఖ, ఉపాధ్యాయులు బండి ప్రభాకర్‌రెడ్డి, ఏఎన్‌ఎం ఎర్రసానమ్మ, ఆశా వర్కర్ గీత పాల్గొన్నారు.

అడవికి నిప్పు పెడితే చర్యలు


అడవిని పరిశీలిస్తున్న ఫారెస్టు సిబ్బంది

వడమాలపేట: వేసవి కాలంలో అడవికి నిప్పు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని పుత్తూరు ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ చంద్రశేఖర్‌రాజు తెలిపారు. ఆయన గురువారం వడమాలపేట మండలం ఎస్వీపురం రెవెన్యూ పరిధిలోని అడవిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొండలకు నిప్పు పెట్టడం వల్ల ఎన్నో జంతువులకు ఆహారం దొరకదన్నారు. అలాగే చెట్లతోపాటు జీవులు కాలిబూడిదవుతాయని పేర్కొన్నారు. ఎవరైనా అడవికి నిప్పు పెడితే వెంటనే ఫారెస్టు అధికారులకు తెలియజేయాలని కోరారు. సిబ్బంది శివరాజు, చంద్రబాబు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి


కృష్ణంరాజు (ఫైల్)

కార్వేటినగరం: మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కేసీ కృష్ణంరాజు(72) గురువారం గుండెపోటుతో కన్నుమూశారు. వ్యవసా పనులు చేసుకుంటుండగా అస్వస్థతకు గురి కావడంతో వెంటనే కార్వేటినగరం పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, కో–ఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి తదితరులు కృష్ణంరాజు కుటుంసభ్యులను పరామర్శించారు.

ప్రభుత్వ ఆస్పత్రికి దుప్పట్ల వితరణ


సూపరింటెండెంట్‌కు దుప్పట్లను అందజేస్తున్న దాత

నగరి: స్థానిక ఏరియా ఆస్పత్రికి గురువారం తెరణికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మోహన్ రూ.10 వేలు విలువైన 50 దుప్పట్లు వితరణ చేశారు. వాటిని గురువారం ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ బాలకృష్ణనాయక్‌కు అందజేశారు. ఆర్‌ఎంవో గోపాల్, ఆస్పత్రి కమిటీ డైరెక్టర్ కృష్ణమూర్తి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజరత్నమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకునికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: సంకట చతుర్థి పురస్కరించుకుని గురువారం శ్రీకాళహస్తీశ్వరాలయంలోని వినాయకునికి ప్రత్యేక పూజలు, హోమా లు చేశారు. ఇటీవల ఈ పూజలను ఆర్జితసేవ గా పాలకమండలి నిర్ణయించడంతో భక్తులు పెద్దసంఖ్యలో పూజలకు హాజరయ్యారు. ఆలయ పండితులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్య క్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆలయ గోపురానికి కలశాల సమర్పణ


గోపుర కలశాలను అందజేస్తున్న సరోజనమ్మ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి గురువారం పట్టణానికి చెందిన సరోజనమ్మ నాలుగు గోపుర కలశాలను సమర్పించారు. వీటిని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, స్థపతి కుమార్, అర్చకులు అప్పాజీ శర్మ, మోహన్‌శర్మ, పాలకమండలి మాజీ సభ్యులు పీజే చంద్రయ్య,శెట్టి, సెన్నీరు కుప్పం తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తులకు అధిక గిరాకీ

- తోట వద్దే విక్రయాలు
- ఆరోగ్యకర ఆహారంపై పెరుగుతున్న ఆసక్తి


ఆర్గానిక్ కూరగాయల దుకాణంలో కొనుగోలు చేసుకుంటున్న వినియోగదారులు

నగరి: పంటల దిగుబడి పెరిగేందుకు రైతులు రసాయనిక ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వినియోగిస్తున్నారు. తద్వారా భూమి నిస్సారం అవడంతోపాటు ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన శాస్త్రవేత్తలు, నిపుణులు ఆర్గానిక్ పంటల సాగుపై దృష్టిసారించారు. తద్వారా కలిగే లాభాలను వివరిస్తున్నారు. దీంతో ప్రజలు కూడా ఆర్గానిక్ పంట ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. కాస్త ధర ఎక్కువైనా ఆరోగ్యకర పంటలనే తినాలనే సంకల్పం రోజురోజుకూ పెరుగుతోంది. తక్కువ వ్యవధిలో అధిక దిగుబడి కావాలంటూ రసాయనిక ఎరువుల వ్యామోహంలో పడి వదలిపెట్టిన సేంద్రియ వ్యవసాయంతో పాటే ఆరోగ్యం కూడా నాశనం అయింది. ముఖ్యంగా దేశంలో 1965–2000 మధ్య రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం బాగా పెరిగింది. అధిక దిగుబడి, అధిక లాభాల పేరుతో వీటిని విచ్చల విడిగా ఉపయోగించేవారు. దీని వల్ల భవిష్యత్తులో ఎన్నో సమస్యలను కొని తెచ్చుకుంటామని వ్యవసాయ అధికారులు హెచ్చరించినా ఎవరూ పట్టించుకోలేదు. రసాయనిక ఎరువులు వాడడం వల్ల వానపాములు నశించి భూసారం పూర్తిగా దెబ్బతింటూ వస్తోంది. పరిస్థితి ఇలాగే ఉంటే కొన్నేళ్ల తర్వాత పొలంలో పంటలు పండవని పలు అధ్యయనాలు తేల్చాయి. అంతేగాక భూ కాలుష్యం, నీటి కాలుష్య బాగా పెరిగినట్టు శాస్త్రవేత్తలు వివరించారు. ఈ నేపథ్యంలో అధికారుల సూచనల మేరకు కొంతమంది రైతులు సేంద్రియ వ్యవసాయం చేపట్టారు. దిగుబడులు తక్కువైనా మిగిలిన వారికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. ఈ క్రమంలోనే మండలంలోని తడుకుపేట గ్రామ సమీపంలోని తమిళనాడు సరిహద్దును ఆనుకొని ఉన్న అన్నపూర్ణ ఫారమ్స్ వారు సేంద్రియ పద్ధతిలో సొరకాయ, బీరకాయ, బొప్పాయి, వంకాయ, బెండకాయ, పొట్లకాయ, కాలీఫ్లవర్, నిమ్మకాయ, అరటికాయ, తోటాకు, చిర్రాకు, మెంతాకు, కొత్తిమీర, కొబ్బరికాయలు సాగుచేపట్టారు. వాటిని ప్రజలకు అందుబాటులోకి తేవాలని తోటవద్దే రోడ్డున ఆనుకొని దుకాణం ఏర్పాటుచేసి విక్రయించడం అందరినీ ఆకర్షిస్తోంది. ఇప్పటికే ఆర్గానిక్ కాయగూరల ఆరోగ్యకరమైనవని పలువురికి బోధపడటంతో పోటీ పడి మరీ కొనుగోలు చేస్తున్నారు. కాస్త ధర ఎక్కువైనా ఆరోగ్యాన్నిచ్చే ఆహారం కావడంతో జనం వెనకడుగు వేయడం లేదు. ఇలా వినియోగదారులు ప్రోత్సాహం అందిస్తే రైతులందరూ సేంద్రియ వ్యవసాయ బాటలో నడవడం ఖాయమని అధికారులు చెబుతున్నారు.

లోకేష్‌కు దళితులంటే చులకన


మాట్లాడుతున్న గోపీనాథ్

శ్రీరంగరాజపురం: లోకేష్‌కు దళితులంటే చులకన భావం ఉందని ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుప్పయ్య ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసేందుకే ముందుకు రాని లోకేష్ ఇక దళితులకు ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు. ఎస్సీలుగా పుట్టాలని ఎవరు కోరుకుంటారని గతంలో చంద్రబాబు కించపరిచిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. తండ్రీకొడుకులకు ధోరణికి టీడీపీలోని దళిత నేతలు సిగ్గుపడాలని స్పష్టం చేశారు. ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా నారా కుటుంబాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు.

కార్వేటినగరం: చంద్రబాబు, లోకేష్‌కు దళితులంటే గిట్టదని ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి ఎం. గోపీనాథ్ ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసేందుకు లోకేష్ నిరాకరించడం దారుణమన్నారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో పాదయాత్ర చేసేందుకు ఆయనకు అర్హత లేదని స్పష్టం చేశారు. దళిత నాయకుడు శేషాద్రి మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్‌కు ఎస్సీల ఓట్లు మాత్రం కావాలని, వారిని గౌరవించడం మాత్రం రాదని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మురగయ్య, చరణ్, శోభన్‌బాబు, దొరబాబు, మాసులామణి, అర్జునయ్య పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ


శిక్షణ ఇస్తున్న ఆఫీసర్ గురుసాయి

పుత్తూరు రూరల్: స్థానిక శ్రీవిద్య డిగ్రీ కళాశాలలో గురువారం మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, కెరీర్ గ్రోత్‌పై శిక్షణ ఇచ్చారు. ఫైనల్ ఇయర్ బీఎస్సీ, బీకాం విద్యార్థులకు ఉద్యోగావకాశాలపై అన్ని రకాల నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన వారికి మార్చిలో ఎంఎన్‌సీ కంపెనీ ప్రతినిధులు జాబ్ మేళా నిర్వహించనున్నారు. కార్యక్రమంలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పి.వెంకట ప్రసాద్, ట్రైనింగ్ ఆఫీసర్ కె.గురుసాయి, కళాశాల కరస్పాండెంట్ జి.ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం


మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర, పక్కన జడ్జీలు లీలాశ్యామసుందరి, గోపాలకృష్ణ

పుత్తూరు రూరల్: లోక్ అదాలత్‌లో కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని, స్థానిక సబ్‌కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పుత్తూరు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర తెలిపారు. ఆయన గురువారం పుత్తూరు కోర్టులో న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు అత్యధిక కేసుల పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. కోర్టులో పెండింగ్‌లో లేని ప్రీ లిటిగేషన్ కేసులను సైతం లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. రాజీ మార్గమే సురక్షితమైనదని కక్షిదారులకు అవగాహన కల్పించాలని వివరించారు. తద్వారా పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కరించేలా చూడాలని కోరారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.లీలాశ్యామసుందరి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గోపాలకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

నగరి: మంత్రి ఆర్కేరోజా శుక్రవారం నగరి నియోజకవర్గంలో పలు కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఉదయం 11:30 గంటలకు స్థానిక క్యాంప్ కార్యాలయంలో నగరి మండలానికి సంబంధించిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు ఎంపీటీసీలు, చైర్మన్లు, రాష్ట్ర బోర్డు డైరెక్టర్లు, కో ఆప్షన్ సభ్యులు, వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వలంటీర్ల సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. అదేవిధంగా సాయంత్రం 4 గంటలకు పుత్తూరు మండలం కృష్ణ సముద్రం సచివాలయం పరిధిలోని రామసముద్రం పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

కార్వేటినగరం: మండలంలోని గాజంకి గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి డీఈ చిన్నరెడ్డెప్ప గురువారం స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆదేశాల మేరకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. నూతన కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి త్వరలోనే మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ అరోహరరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మురగయ్య, పంచాయతీ కార్యదర్శి మనోష్ని పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు


మాట్లాడుతున్న ఎంపీపీ శ్యామల

పాలసముద్రం: పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని ఎంపీపీ శ్యామల ఆదేశించారు. గురువారం మండలంలో వనదుర్గాపురం, కృష్ణజమ్మపురం సచివాలయాను తనిఖీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సమన్వయంతో పని చేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఏర్పేడు: మండలంలోని కొత్తవీరాపురం వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు ఏర్పేడు సీఐ శ్రీహరి గురువారం రాత్రి తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

మొక్కవోని దీక్షతో శివరాత్రి బ్రహ్మోత్సవాలు

- సమష్టి కృషితో విజయవంతం చేద్దాం
- సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత
- స్థానికులకు 'ఆధార్'తో రూ.500 టిక్కెట్ రూ.200లకే!
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: మొక్కవోని దీక్షతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడానికి అందరూ సమష్టి కృషి చేయాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 13 నుంచి ప్రారంభం కానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం ఆలయ పరిపాలన భవనంలో అన్ని శాఖల అధికారులతో ఎమెల్యే సమావేశమయ్యారు. శాఖల వారీగా చేయాల్సిన పనులు, విధులపై చర్చించారు. 16న శివదీక్ష స్వీకరించి సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. శివదీక్షతో వచ్చే భక్తులకు ప్రశాంతంగా దైవదర్శనం అయ్యేలా విధులు నిర్వర్తించాలన్నారు. పూల అలంకరణతో ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నామని, ఈ పర్యాయం లక్ష, 3లక్షలమంది భక్తులు వస్తారని అంచనా వేసినట్లు చెప్పారు. ఉత్సవాల నిర్వహణకు రూ.4కోట్లు వ్యయం అవచ్చని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. ధూర్జటి కళాప్రాంగణం, శ్రీకాళహస్తి స్వర్ణముఖి నదీ తీరం, శివయ్య గోపురం పీవోపీ, ఫైబర్‌లతో కై లాసం సెట్టింగ్, శివపార్వతుల ప్రతిమలను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. లైటింగ్‌షో ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందన్నారు. బాల్యవివాహాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యం సమస్యలు ఉత్పన్నం కాకుండా పురపాలక శాఖ నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ప్రమాదాల జరగకుండా అగ్నిమాపక శాఖ చూడడంతోపాటు గాలిగోపురం మీద పేరుకుపోయిన చెత్త, మట్టిని తొలగించాలన్నారు. ఈసారి బందోబస్తుకు 700మంది పోలీసులను కేటాయించాలని ఎస్పీని కోరనున్నట్టు చెప్పారు. సామాన్య భక్తులకే అధిక ప్రాధాన్యత ఇవ్వాన్నారు. భ్రమరాంబ అనే సంస్థకు చెందిన మహిళలు 500 మంది రాష్ట్రం నలుమూలల నుంచి ఇక్కడ సేవ చేసేందుకు వస్తున్నారని, వారితో మర్యాదగా నడచుకోవాలన్నారు. స్థానిక భక్తులకు ముందు రోజు రూ.500 టిక్కెట్లు రూ.200కే కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డు తీసుకెళితే వారికి టిక్కెట్లు మంజూరు చేస్తామన్నారు. చైర్మన్, బోర్డు సభ్యులు భక్తులకు క్రమబద్ధంగా సేవలందించాలన్నారు. చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ, ఎమ్మెల్యే, అధికారుల, పాలక మండలి సహకారంతో మహాశివరాత్రి ఘనంగా నిర్వహిస్తామన్నారు.సమావేశంలో ఈవో సాగర్‌బాబు, డీస్పీ విశ్వనాథ్, కమిషనర్ బాలాజీనాయక్, సీడీపీఓ శాంతిదుర్గ, సీఐ అంజూయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


హాజరైన పలుశాఖల అధికారులు

అభివృద్ధి పనులకు భూమి పూజ


సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: మండలంలోని కొల్లాగుంటలో గురువారం రూ.24లక్షల అభివృద్ధి పనులకు ఎంపీపీ లత భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. అందులో రూ.12.5లక్షల వ్యయంతో కమ్యూనిటీ భవనం, రూ.7.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నామని, రూ.4లక్షలతో మౌలిక వసతులు కల్పించనున్నట్లు వివరించారు. మండలంలో ఇప్పటి వరకు 98శాతం సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కో–ఆప్షన్ సభ్యుడు పట్నం ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ దివ్య, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులురెడ్డి, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ సుబ్రమణ్యం, మాజీ సర్పంచ్ మునికృష్ణ, నాయకులు గాంధీ, శేషాద్రి పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై ఉక్కుపాదం


మాట్లాడుతున్న డీఎస్పీ రవికుమార్

పాలసముద్రం: ఇసుక, ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని డీఎస్పీ రవికుమార్ ఆదేశించారు. గురువారం పాలసముద్రం పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ మండలం తమిళనాడు సరిహద్దులో ఉండడం వల్ల కట్టుదిట్టంగా నిఘా పెట్టాలని సూచించారు. ప్రజలతో ఫ్రెండ్లీగా ఉండాలని కోరారు. అనంతరం రికార్డులు పరిశీలించారు కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ సురేష్ పాల్గొన్నారు.

కాలువ నిర్మాణ పనుల పరిశీలన


పనులకు పరిశీలిస్తున్న ఈఈ విజయకుమార్

పుత్తూరు రూరల్: పుత్తూరు మండలం రామకృష్ణాపురం సచివాల పరిధిలోని శిరుగురాజుపాళెం హరిజనవాడలో రూ.7.5 లక్షలతో చేపట్టిన 320 మీటర్ల కాలువ నిర్మాణ పనులను గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ విజయకుమార్, ఏఈఈ తరుణ్ పరిశీలించారు. పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా ఇటీవల పుత్తూరు మండలం రామకృష్ణాపురం సచివాలయ పరిధిలోని శిరుగురాజుపాళెం హరిజనవాడలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు కాలువ సమస్యను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన మంత్రి కాలువ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. సర్పంచ్ మురళియాదవ్, వార్డు మెంబర్ వెంకటముని, వలంటీర్ కృష్ణ పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

నగరి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్.వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రేణిగుంటలోని ప్రముఖ మొబైల్ కంపెనీలో సెల్ ఫోన్ అసెంబ్లర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్ పాస్ గానీ ఫెయిల్ అయిన యువతులు అర్హులని పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు ఉండాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.13 వేల జీతం ఇస్తారని తెలిపారు. ఆసక్తి గలవారు ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్, ఆధార్ కార్డ్, బ్యాంక్ అకౌంట్ కాపీ, రేషన్ కార్డ్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని తెలిపారు. వివరాలకు 7702373441లో సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ హైస్కూళ్లకు స్మార్ట్ డిస్‌ప్లే బోర్డులు


మాదనపాళెం స్కూల్‌కు స్మార్ట్‌బోర్డు అందజేస్తున్న ఇషిహార

- శ్రీసిటీ టీహెచ్‌కే ఇండియా పరిశ్రమ వితరణ
- రూ. 16 లక్షల విలువైన 12 బోర్డులు

సత్యవేడు: ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ సామాజిక సేవల్లో భాగంగా శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో శ్రీసిటీలోని టీహెచ్‌కే ఇండియా పరిశ్రమ మూడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు స్మార్ట్ డిస్‌ప్లే బోర్డులను వితరణ చేసింది. గురువారం మాదనపాళెం ఉన్నత పాఠశాలకు 2, చెరివి ప్రాథమికోన్నత పాఠశాలకు1, ఇరుగుళం ఉన్నత పాఠశాలకు 5 బోర్డులను కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ షుసాకు ఇషిహార ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. షుసాకు ఇషిహార మాట్లాడుతూ, అభ్యసన, బోధనలో సాంకేతికత వినియోగంతో ప్రాథమిక విద్యాబోధన విధానంలో మంచి మార్పులు వస్తాయన్నారు. ఇందుకుగాను స్మార్ట్ బోర్డులను సమర్థవంతంగా వాడుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు టీహెచ్‌కే పరిశ్రమ సహకారాన్ని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు. విద్యలో సాంకేతికత ఎంత ప్రముఖ పాత్ర పోషిస్తుందో ముఖ్యంగా కోవిడ్ సమయంలో అందరూ చూశామన్నారు. శ్రీసిటీ ఫౌండేషన్ కార్యకలాపాల్లో విద్య ఒక ప్రధాన అంశమని, పరిశ్రమలతో కలసి పరిసర ప్రభుత్వ ఉన్న పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పరచడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) నిధుల కింద కంపెనీ మొత్తం రూ.16 లక్షలతో 12 స్మార్ట్ బోర్డులను వితరణ చేసింది. ప్రస్తుతం మూడు స్కూళ్లకు 8 బోర్డులు పంపిణీ చేసింది.

స్కానింగ్ కోసం ప్రదక్షిణలు

- సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు

చిత్తూరు రూరల్: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ గర్భిణి స్కానింగ్‌కు వస్తే మూడు రోజుల నుంచి ప్రదక్షిణలు చేయించుకుంటున్నారని నిరసిస్తూ బాధితురాలి కుటుంబ సభ్యులు గురువారం ఆ విభాగం వద్ద గొడవకు దిగారు. అక్కడి సిబ్బంది దురుసుగా ప్రవర్తించడంతో గర్భిణి కుటుంబీకులు సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశా రు. ఆయన స్పందించారు. స్కానింగ్ చేయాలని స్కానింగ్ విభాగ సిబ్బందిని ఆదేశించారు. ఫిర్యా దుదారులతో మాట్లాడి శాంతింపజేశారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు రా..రమ్మని!


కలెక్టర్ వెంకటరమణా రెడ్డికి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక ఇస్తున్న చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, ఈఓ

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటుపల్లిలో ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు సుమన్‌ను ఆహ్వానించారు. గురువారం ఆలయ ఈఓ రామచంద్రా రెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, సభ్యులు గురువారం తిరుపతిలోని కలెక్టర్ కార్యాలయం, పుత్తూరులోని ఎమ్మెల్యే స్వగృహానికి వెళ్లి ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేయ గురుక్కళ్, ధర్మకర్తల మండలి సభ్యులు ఆనందుడు, ఎస్‌ఎం సురేష్, మునివేలు, అజయ్‌కుమార్, ప్రత్యేక ఆహ్వానితులు రాధాక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.